ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

# మహాకవి జాషువా – విశ్వనరత్వం

**డా. కె. కరుణశ్రీ**

డి. కె. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం),నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

9441540317

Article Received: 18/0/2025

Article Accepted: 01/07/2025

Published Online: 02/07/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2417

**ఉపోద్ఘాతం**

మానవతా మంత్రాన్ని ఆచరణలో చూపిన మహామనిషి గుర్రం జాషువా. తెలుగు సాహిత్య చరిత్రలో జాషువా పేరు ఒక కొత్త దిశను, ఒక కొత్త దర్శనాన్ని సృష్టించింది. ఆయన కవిత్వం కేవలం పదాల సౌందర్యం కాదు; అది మానవతా విలువల ప్రతిధ్వని, సామాజిక చైతన్యపు శంఖనాదం, విశ్వ సోదర భావానికి ప్రతీక.

వినుకొండ అనే చిన్న ఊరిలో పుట్టి, ప్రపంచాన్ని తన కవిత్వంలో అందించిన జాషువా, వ్యక్తిగత కష్టాలను, సామాజిక అన్యాయాలను, మత మూఢనమ్మకాల్ని, వర్ణవివక్షను ప్రశ్నిస్తూ, మానవ ప్రేమను పరమతత్వంగా ఆరాధించాడు. అతని కవిత్వంలో కనిపించే ప్రాంతాభిమానమూ, భాషాభిమానమూ, దేశాభిమానమూ ఎప్పుడూ సంకుచితతకు లోనుకాక, విశ్వమానవత్వానికి పునాది వేశాయి.

జాషువా ఈశ్వరతత్వాన్ని ప్రశ్నించాడు, కాని ఆయన ఉనికిని నిరాకరించలేదు; మతాల మధ్య తేడాలను విమర్శించాడు, కానీ మానవత్వాన్ని ఏకమతంగా గౌరవించాడు. “గబ్బిలం”, “కొత్తలోకం”, “ముసాఫిర్లు” వంటి రచనల ద్వారా తన ఆలోచనల గంభీరతను, తన అంతర్మనసులో మాగిన తాత్విక తపనను తెలియజేశాడు.

కాబట్టి జాషువా కేవలం ఒక కవి కాదు — ఆయన ఒక చింతకుడు, సంస్కర్త, మానవతా శిల్పి. తెలుగు జాతి గర్వించదగిన ఈ విశ్వనరుడి ఆలోచనలు నేటికీ సమకాలీనమే. ఈ వ్యాసం ఆయన ఆలోచన, అభిమానం, ఆస్తిక దృక్పథం, విశ్వమానవతా భావాలపై ఒక సమగ్ర పరిశీలన.

**కీలక పదాలు:**మహాకవి, విశ్వనరుడు, మానవతావాది, హేతువాది, సర్వ మత సమానత్వం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

"ఉదార చరితానాం తు వసుధైక కుటుంబకమ్"

ఏ వ్యక్తికైనా కన్నతల్లి, ఉన్న ఊరు పట్ల అభిమానం సహజం. సొంత ఊరిపై ఉన్న అభిమానాన్ని వ్యామోహంగా మార్చుకొని సంకుచితంగా అక్కడే ఆగిపోయే వాళ్ళు కొందరైతే, పుట్టి పెరిగిన ఊరిని గాలికొదిలేసే వాళ్ళు మరికొందరు. పుట్టి పెరిగిన ఊరు తన పట్ల అన్యాయంగా ప్రవర్తించి ఉంటే ఇక చెప్పేదేముంది.

కానీ! పుట్టిన ఊర్లో చిన్నతనంలో చేదు జ్ఞాపకాలే ఎక్కువైనా వాటిని మనసుకు అంటనివ్వకుండా, ఒకానొక స్థాయిలో వ్యామోహమా? అనిపించేంత స్థాయిలో అభిమానించి, తన ఆ అభిమానాన్ని క్రమక్రమంగా విస్తరించుకుంటూ తన జిల్లాకు, జిల్లా నుండి రాష్ట్రానికి, రాష్ట్రం నుండి దేశానికి, దేశం నుండి ప్రపంచానికి, విశ్వానికి విస్తరింప జేసుకున్న వాడు విశ్వనరుడు. ఆ విశ్వనరుడే గుర్రం జాషువా.

గుంటూరు జిల్లాలోని వినుకొండ గ్రామంలో సెప్టెంబర్ 1895న పుట్టిన జాషువాకి నాటి సామాజిక పరిస్థితుల కారణంగా తన సొంత ఊర్లో తనకు తీపి జ్ఞాపకాలేమీ లేవు. దీపాల పిచ్చయ్య శాస్త్రి లాంటి ఆప్త మిత్రుల సాహచర్యం వంటివి తప్ప బజారు దుమ్ము ఒంటి నిండా కొట్టుకుంటూ, తోటి పిల్లలతో గోలీలాడుకుంటూ తిరిగిన ఆ వినుకొండను చూడగానే హృదయం పొంగిపోయి ఆ ఊరు తనకు ఏమిచ్చిందన్న ఆలోచన కూడా రాకుండా "నీరిచ్చిన నీయకున్న సహజంబుల్ భక్తి తాత్పర్యముల్" అంటూ తన ఊరి పట్ల తనకున్న అవ్యాజమైన అభిమానాన్ని ప్రకటించాడు. ఆ అభిమానం స్థాయి దాటి

'అట్టి వినుకొండ కడుపున పుట్టుకతన
ధన్యుడన నేను ఉత్తమోత్తముడ నేన' అంటూ జాషువా
'శిరము నెరసిన వినుకొండ సీమ మాది" అని ప్రకటించాడు.

జాషువా తనలో జరుగుతున్న క్రమ వికాసంలో భాగంగా ఆంధ్ర శిల్పకళకు, బౌద్ధ స్థూప రచనకు, క్రీస్తు పూర్వమే ఆచార్య నాగార్జునుని ఆధ్వర్యంలో వెలసిన విద్యాలయాలకు, అస్పృశ్యత జాడ్యాన్ని నిర్మూలించడానికి మొదటడుగు వేసి సంహపంక్తి భోజనానికి బాటలు వేసిన బ్రహ్మనాయని సంస్కరణాభిలాషకు, బాల చంద్రుని వంటి వీరులకు ఆటపట్టైన గుంటూరు జిల్లాను 'పెట్టిన పేరు గర్తపురి విద్యకు, గాన కళా ప్రసిద్ధికిన్' అంటూ 'వీర భాషాభిరామ గుంటూరు సీను'ను కొనియాడారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

జాషువా స్వీయ రాష్ట్రాభిమానం వెల్లువలై ప్రవహించిన కావ్యం గబ్బిలం. ప్రస్తుతం తమిళనాడులో ఉన్న తంజావూరు నుండి ఉత్తరప్రదేశ్లో వున్న కాశీ వరకు గబ్బిలం ప్రయాణం సాగినప్పటికీ కావ్య వర్ణనలో సింహభాగం ఆంధ్రరాష్ట్రం ఆక్రమించింది. ప్రక్క రాష్ట్రాల్లో వెలసిన తెలుగు సంస్కృతిని కూడా జాషువా మర్చిపోలేదు. కొంచెం చుట్టు దారైనా వాటిని కూడా దర్శించి పొమ్మని గబ్బిలానికి చెప్పడంలో జాషువా ఆసక్తి మనకు కన్పిస్తుంది. ఇదే కాక తెలుగుభాష, తెలుగు సంప్రదాయం, తెలుగు పౌరుషం, తెలుగు గడ్డ, ఇలా అనేక రకాలుగా తెలుగు రాష్ట్రాభిమానం విశ్వరూపం ధరించింది. జాషువా రచనల్లో "గడనకెక్కిన యాంధ్ర పుత్రుడ నేను" "మడమద్రిప్పని యాంధ్ర వీరుడను నేను" అంటూ ఆంధ్రుల మనసు దోచుకున్న మహాకవి జాషువా.

జాషువా మహాకవిలో ఉన్న ఆంధ్ర భాషాభిమానం ఎల్లలు దాటి పొరుగు రాష్ట్రాలపై కూడా ప్రసరించిందే తప్ప ద్వేషంగా పరిణమించలేదు. భారతీయ చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతను, హిమాలయోన్నతిని, హిందూ మహాసముద్రాన్ని, స్త్రీ పురుషుల వీరత్వాన్ని, ఇక్కడి వైవిధ్యాన్ని, పాడి పంటల్ని వేటిని వదలకుండా స్పృశించి

"సింధు గంగా నదీ జల క్షీరమెపుడు
గురిసి బిడ్డల బోషించుకునుచు నున్న
పచ్చి బాలెంతరాలు మా భారతమాత

మాతలకు మాత, సకల సంపత్సమేత" అంటూ 1893లో చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో వివేకానందుడు చేసిన సింహగర్జనను, అహింసా వత్రంలో మహాత్ముడు సాధించిన స్వాతంత్ర్యాన్ని, ప్రపంచానికి తత్త్వాన్ని తెలియజేసిన సర్వేపల్లి రాధా కృష్ణన్ ని, గీతాంజలితో విశ్వ సాహితీ లోకాన్ని ఆవరించిన రవీంద్రుని, వృక్ష జాతిలో ఉన్న జీవత్వాన్ని ప్రపంచానికి తెలియ జెప్పిన, జగదీశ్ చంద్రబోస్ ఔన్నత్యాన్ని కీర్తిస్తూ "అచ్చముగ భారతీయుడనయితి నేను" అని చాటి చెప్పాడు.

కరుణ, మానవతావాదం తొణికిసలాడే హృదయం జాషువాది. ఒక వ్యక్తికో, వర్గానికో, జాతికో, ప్రాంతానికో పరిమితం కాకుండా సర్వ మానవుల్లో బంధు భావాన్ని దర్శించి, సంకుచిత, మతోన్మాదాన్ని ఖండించి 'సర్వే జనాః సుఖినో భవంతు' అను భావనతో మనస్సును విశాలం చేసుకున్న విశ్వనరుడు జాషువా. కాబట్టే ఎక్కడో ఇరాన్లో పుట్టిన మహమ్మదీయుడైన ఫిరదౌసి తన కావ్య నాయకుడు కాగలిగాడు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

"నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగులేదు, విశ్వనరుడ నేను" అన్న ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించిన జాషువా మాటలు ప్రత్యక్షర సత్యాలు.

కొందరు జాషువాను నిరీశ్వర వాదిగా (నాస్తికునిగా) హేతువాదిగా చిత్రించారు. ఒక రచయితను అంచనా వేసేటప్పుడు దానికి ఆధారం అతని రచనలే. సినారె చెప్పినట్లు రచయిత ఎక్కడ దాక్కోగలడు తన రచనల్లో తప్ప. ఈ రకంగా చూసినపుడు జాషువాలో ఎక్కడా నాస్తికత్వం కన్పించదు. ఇక రెండవది హేతువాదం. దాన్ని చర్చించే ముందు అసలు హేతువాది అంటే సరైన అర్థాన్ని గ్రహించాల్సిన అవసరం ఉంది.

"సృష్టికర్తవు నీవు నీ సృష్టిలోని
మానవుండ నేనిద్దరి మధ్య మనకు
ముసుగులో గుద్దులాట పొసగవింక
హక్కు గలదయ్య ప్రశ్నవేయంగ నిన్ను"

సృష్టిలో ప్రాణుల మధ్య ఉన్న అంతరాన్ని, మతం పేరిట జరుగుతున్న దురాగతాల్ని, కొన్ని ప్రాణులు జీవితాంతం కష్టాల్నే అనుభవించడంలోని భగవంతుని దయాళుత్వాన్ని ప్రశ్నించాడే కానీ, భగవంతుని ఉనికిని కాదు. ఈ రకమైన హేతువాదం జాషువా అంతరంగంలో పోటెత్తుతున్న సృష్టి వైవిధ్య అంతరార్థ అన్వేషణా కాంక్షను తెలియజేస్తుందే తప్ప నిరీశ్వర వాదాన్ని కానీ, లేదా ఈ రోజు కొంత మంది ఈ పదానికి పర్యాయంగా వాడుతున్న "హేతు వాదాన్ని" కానీ కాదు.

'ఆధునిక కవిత్వం అర్థం కాలేదంటే ఆధునిక జీవితం అర్థం కాలేదని శ్రీ శ్రీ చెప్పినట్లు రచయిత రచనల్లోని కొన్ని విషయాల్ని అర్థం చేసుకోవాలంటే రచయిత జీవితం అర్థం కావాలి. ఇది కవి జీవిత కావ్య సమన్వయ విమర్శనా దృక్పథంతో పరిశీలించినప్పుడు అర్థమవుతుంది. జాషువాలోని నాస్తికత్వాన్ని గుర్తించే వాళ్ళు ప్రధానంగా కొత్తలోకం, ముసాఫిర్లు రచనల్ని ఆధారంగా చేసుకొని చెప్తున్నారు.

పై రచనల కాలం నాటికి జాషువా వ్యక్తిగత జీవితం అల్లకల్లోలంగా ఉంది. తన జీవితానికి మార్గ దర్శనం చూపిన తండ్రి, తనను ప్రాణంగా చూసుకొనే తల్లి మరణాలు, తను ప్రాణంగా చూసుకునే భార్య వియోగం, ఆపై వృద్ధాప్యం, ఇవన్నీ జాషువా మనస్సును నాలుగు వైపుల నుండి ముంచెత్తాయి. ఆ సమయంలో వచ్చిన కావ్యాల్లో భగవంతుని పట్ల నిష్ఠురత కన్పిస్తుంది. కానీ ఆనిష్టురతలో కూడా నిరీశ్వరత మాత్రం లేదు.

"కనపడవేమిరా జగము కల్పన చేసిన గారడీడ! నీ

యునికియు రూపమున్ తెలియకున్నది లేనిది నిర్ధరింపలే
కనుపమ సంశయ గ్రసితమైనది విశ్వము, సాగవింక ద ర్శ
నమిడకున్న, నీ తర తరంబుల దాగుడు మూత వేషముల్"

అంటూ భగవంతుని నిలదీసి. "అడుగదగు నాల్గు మాటల నడుగక నేనెట్టులుందు - "నంటూ భగవంతునితో తాడోపేడో తేల్చుకోవడానికి స్థిరమైన జాషువాలో ఈశ్వర ఉనికికి సంబంధించిన ప్రశ్నలేదు. ఇదే నిరీశ్వర వాదం అనుకుంటే 'కలడు కలండనువాడు కలడో, లేడో" అని గజేంద్రుని ద్వారా అనిపించిన పోతన కూడా నాస్తికుడే అనుకోవాలి.

సృష్టిలోని ప్రత్యణువును భగవంతుని సృష్టిగానే పరిపూర్ణంగా విశ్వశించిన వాడు జాషువా. గిజిగాడు ఖండికలో గిజిగాని సౌందర్యానికి, నైపుణ్యానికి, విచిత్రమైన ఆ పేరుకు ముగ్ధుడైన జాషువా.

"నీ గిజిగాని నామకము, నీ తెలివిన్ బ్రకటించు గూడు, నీ
మైగల సోయగం బవని మానవ కోటికి ముద్దు సేయునో
యీ గిజిగాడా! భీతిలకు మీవు ధరాతలి నున్న బిట్టుగా
వాగెడు నాస్తికుల్ తలలు వంతురవంతుని చెంత ఖిన్నులై"

అంటూ సృష్టిలోని ప్రతి అంశాన్ని భగవంతుని ఉనికికి నిదర్శనంగా తను గుర్తించడమే కాకుండా, అలా గుర్తించకుండా నాస్తికత్వమనే మార్గంలో పయనించే వాళ్ళకు కూడా గుర్తింప జేస్తున్నాడు.

ఇందులో మరొక విశేషమేమిటంటే, ఈ పద్యంలో జాషువా మహాకవి ప్రయోగించిన శబ్దశిల్పం. ఇందులో 'వాగెడు' అనే పదం నిరీశ్వర వాదుల పట్ల జాషువాకున్న చిన్న చూపును కూడా తెలియజేస్తుంది.

జాషువా తన రచనల్లో ప్రయోగించిన ఈశ్వర, దేవ దేవ, అనంత, లోకాధీశ, జగన్నియంత, సృష్టికర్త, గారడీడ! మహాశక్తి, అద్భుత చరితా మొదలైన పదాలు భగవంతునికి పర్యాయ పదాలుగానే ప్రయోగించాడు. జాషువా కేవలం ఒక మతానికే పరిమితం కూడా కాలేదు. 'మత పిచ్చి గానీ వర్గోన్నతి గానీ స్వార్థ చింతనము గానీ నాకృతులందుండడు ...." అని తనే నిర్ద్వద్వంగా ప్రకటించాడు జాషువా.

"నా కట్టించు మసీదులన్ మసులచున్ నా కాన్కలాసించుచున్
నాకుం గీడు దలంచినాడతి కృతఘ్నుత్వంబు వాటించుచున్" అంటూ ఇస్లాంను ఈసడించినా, "ముప్పది మూడు కోట్ల దేవత లెగబడ్డ దేశమున్ భాగ్య విహీనులక్షుత్తులారునే" అంటూ హిందుత్వాన్ని హింకరించినా, కరుణా మయుడైన క్రీస్తును అత్యంత పాశవికంగా శిలువ లేసి క్రూరంగా చంపిన రోజును, 'హృదయాలను

పిండిగా నలచి వేయు దుర్దినంబు గాక మంచి శుక్రవారమా?' అంటూ క్రైస్తవంలోని అసంగత్వాన్ని వేలెత్తి చూపినా, అది మనం మొదట్లో చెప్పుకున్న సృష్టిలోని అన్ని ఛాయల్లో వెలగొందుతున్న ఈశ్వర తత్వాన్ని గుర్తించగల జాషువా సర్వమత సమానత్వ భావానికి నిదర్శనమే కానీ మరొకటి కాదు. అందుకనే - "అల్లావో, మరియా తనూజుడవో! యబాకుండవో శాంబరీ భిల్ల స్వామివో, బుద్ధ దైవతమవో, వేదాంత శాస్త్రాళిలో వల్లింపబడు శబ్దస్వరూపుడవో, అంటూ అన్వేషణ సాగించిన ఆస్తిక వాది జాషువా. జాషువా గురించి ఆయన మాటల్లోనే చెప్పాలంటే -

తమ్మిచూలి కేలు తమ్మిని కల నేర్పు
కవి కలంబునందు కలదు కాన
ఈశ్వరత్వ మతనికే చలామణి అయ్యె
నిక్కువముగ పూజనీయుడతడు

**ఉపయుక్త గ్రంథ సూచీ (Works Cited – MLA 9th Edition)**

జాషువా, గుర్రం. నాకథ. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రచురణ సంవత్సరం లేదు.
జాషువా, గుర్రం. గబ్బిలం. విజయవాడ: జ్యోతి బుక్స్, ప్రచురణ సంవత్సరం లేదు.
ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యం. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ప్రచురణ సంవత్సరం లేదు.
నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష. విజయవాడ: నవ్య పబ్లికేషన్స్, ప్రచురణ సంవత్సరం లేదు.